

బడి బయట పిల్లలపై దృష్టి సారించాలి: డీఈవో

గజపతినగరం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): బడి బయటున్న పిల్లలను గుర్తించి పాఠశాలకు వచ్చేలా వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ-2 పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం డ్రాపౌట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నవారిని గుర్తించి తిరిగి బడికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో ఎస్. విమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కుమార్ ఉన్నారు.

స్వరూపం మారినది



ఎంతో ఆహ్లాదంగా ఉండాల్సిన చంపావతి నది నీరు లేక వెలవెలబోతోంది. అంతకన్నా ముఖ్యంగా ఇసుక ఆనవాళ్లు కనిపించకపోవడం అందరినీ విస్తు పరుస్తోంది. నది అంటేనే నీరు..ఇసుక పెనవేసుకుని ఉండాలి. చంపావతిని చూసేవారు ప్రకృతి వనరులు ఈ స్థాయిలో దోపిడీ అవుతున్నాయా అని నిర్ఘాంతపోతున్నారు. అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్న తీరుకు ఇది నిదర్శనం. అక్రమంగా రాత్రి పూట కూడా తవ్వుకుని నది స్వరూపాన్నే మార్చేశారు. మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలతో చంపావతి నది కళ తప్పింది.

- నెల్లిమర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):

పల్లెకు అందని ఆర్టీసీ వెలుగు



- ఇంకా మెరుగుపడని రవాణా
- గత ఐదేళ్లలో రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- అప్పట్లో బస్సు సర్వీసులు నిలిపివేసిన వైనం
- పునరుద్ధరించాలని గ్రామీణుల వినతి

6

పర్యాటక ప్రాంతంగా సాలూరు

- వడివడిగా అడుగులు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆధ్యాత్మిక కేంద్రంగా పారమ్మ కొండ అభివృద్ధికి ప్రణాళిక

6


ఆ చెత్తశుద్ధి ఏమైంది?

- నాడు జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు ఎవరూ కన్నెత్తి చూడని వైనం
- బొబ్బిలి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు దుస్థితి ఇదీ
- ప్రైవేటుకు అప్పగించడమే కారణమని విమర్శలు

బొబ్బిలి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు (చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రం) పేరు చెబితే ఒకప్పుడు ఆదర్శమనేవారు. సందర్శించాలని ఆసక్తి చూపేవారు. ఇతర రాష్ట్రాల నుంచి అధికారులు పరిశీలనకు వచ్చి తాము కూడా అనుసరిస్తామని ప్రకటించేవారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుగా గుర్తింపు పొందింది. నాటి ఆ వైభవం నేడు చెదిరిపోయింది. వ్యర్థాలను ప్యాకింగ్ చేయడం లేదు. వర్మీకంపోస్టు తయారీ మొక్కుబడిగా జరుగుతోంది. బయో గ్యాస్, బయో విద్యుత్ ఉత్పత్తి నిలిపేశారు. స్వచ్ఛతా లేదు.. పార్కు గత వైభవాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన వారంతా నేటి దుస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు.

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి మున్సిపాలిటీలో రామన్నదొరవలస గిరిజన గ్రామానికి సమీపంలో సుమారు పదెకరాల ప్రభుత్వ స్థలంలో 12వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.31 కోట్లతో 2010లో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ పార్కును అతి సుందరంగా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి (తడి, పొడి చెత్తను వేర్వేరుగా) దానిని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుకు తరలించి వాటి నుంచి ఎరువులు, బయోగ్యాస్‌తో పాటు బయో విద్యుత్‌ను ఉత్పత్తి చేసేవారు. ఇది నిజమేనా? అని రాష్ట్రంలోని అనేక సంస్థలు, మున్సిపాలిటీల అధికారులు ప్రత్యేకించి బొబ్బిలి వచ్చి పరిశీలించి ఆశ్చర్యపోతుండేవారు. ఇదే మాదిరిగా తమ ప్రాంతాల్లో కూడా చేస్తామనేవారు. మిమ్స్ కళాశాల వైద్య విద్యార్థులు అనేక సార్లు ఇక్కడకు వచ్చి సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై (మిగతా 8వ పేజీలో..)





చెత్తను ఆరుబయట వేసి కాల్చుతున్న దృశ్యం



పార్కులోని ప్రధాన భవనం

గత వైభవం తీసుకొస్తాం..



బొబ్బిలి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుకు గతంలో ఉండే పేరు ప్రఖ్యాతులను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తాం. నిరంతర పర్యవేక్షణతో మరింత ఆధునిక శైలిలో ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాను. పార్కులోని ఖాళీ స్థలాల్లో కూరగాయల పెంపకం చేపట్టాలని యోచిస్తున్నాం. చెత్తనుంచి సంపద సృష్టి కోసం అన్ని అంశాల అమలుకు కృషి చేస్తాం. సందర్శకులు వచ్చేలా సుందరీకరిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

సాలిడ్ వేస్ట్ పార్కుపై దృష్టిసారిస్తా..



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు బొబ్బిలికి మంచి పేరు తెచ్చింది. ఇంటింటి చెత్తసేకరణ, పాలిథిన్ నిషేధం వంటి కార్యకలాపాలకు ప్రజామద్దతును కూడగట్టడంలో గతంలో చాలా కృషి చేశాం. మంచి ఫలితాలను సాధించాం. మళ్లీ దీనిపై దృష్టిసారిస్తా. అధికారులతో సమీక్షించి పార్కు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం.

- బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

మా భూములను లాక్కోవద్దు



భూ సర్వే అధికారులను అడ్డుకుంటున్న సీతంపేట రైతులు(ఫైల్)

- రోడ్డు, కాలువకు భూ సేకరణను వ్యతిరేకిస్తున్న రైతులు
- జీవనాధారం ఏంటని నిలదీత
- నష్టపరిహారంపైనా అసంతృప్తి
- ధరపై స్పష్టత ఇవ్వని అధికారులు

- మా భూముల్లో సర్వే చేయొద్దు. ఒక వైపు పెందుర్తి-బౌడారా(516బి) రోడ్డు బైపాస్‌కు భూములు తీసుకుంటున్నారు. మరో వైపు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి భూమి లాక్కొంటున్నారు. మాకు ఎకరం, రెండెకరాల లోపే భూములున్నాయి. వీటిని కూడా అభివృద్ధి పేరిట తీసుకుంటే వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న మా పరిస్థితి ఏంటి?

- సీతంపేట గ్రామ పరిధిలో ఇటీవల భూసేకరణ సర్వే కోసం వెళ్లిన ఎస్.కోట గ్రామ రెవెన్యూ అధికారులను ప్రశ్నించిన రైతులు

శృంగవరపుకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా పెందుర్తి నుంచి జిల్లాలోని శృంగవరపుకోట మండలం బౌడారా వరకు ఉన్న విశాఖ-అరకు రోడ్డు (516బి)ను విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే విధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి(పోలవరం ఎడమ) కాలువ నిర్మాణానికి భూ సేకరణ జరుగుతోంది. ఈ రెండింటికీ దాదాపుగా 400 ఎకరాల వరకు అవసరమని గుర్తించారు. కాగా పెందుర్తి-బౌడారా రోడ్డు విస్తరణకు నిర్మించాలను కున్న బైపాస్ రోడ్డు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణ పనులు కొత్తూరు, శృంగవరపుకోట గ్రామాల భూముల్లో సమాంతరంగా జరగనున్నాయి. అయితే ఈ గ్రామాల పరిధిలో ఉన్న రైతుల భూములు ఒకే కుటుంబానికి చెందిన వారివి ఉన్నాయి. వీరంతా అర ఎకరా నుంచి ఒకటెంద్రు ఎకరాలున్న కుటుంబాలు కావడం.. ఆ భూమంతా భూసేకరణలో కోల్పోతుండడాన్ని తట్టుకోలేకపో తున్నారు. భూమిని వదులు కొనేందుకు ఇష్ట పడడం లేదు. విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని, సమీపంలో ఉన్న భూములు కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎకరాకు కోట్లలో సొమ్మును ఆశ చూపినప్పటికీ వ్యవసాయంపై ఉన్న మక్కువతో రైతులు భూములను అమ్మలేదు. వారసులకు అస్తిగాను చూపిస్తున్నారు.

ఇలాంటి భూములను ఇప్పుడు ప్రభుత్వం లాక్కొంటుండంతో ఏం చేయాలో అర్థం కాక దిక్కులు చూస్తున్నారు. భూసేకరణ జరగకుండా చూస్తామని ఎవరు చెప్పినా వారి వెంట నడుస్తున్నారు. ఎక్కడకు రమ్మంటే అక్కడకు వెలుతున్నారు. అధికారులు మాత్రం ప్రజా అవసరాల కోసం భూమిని తీసుకుంటామని, ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లిస్తామని చెబుతున్నారు.

పరిహారంపై స్పష్టత కరువు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన మార్కెట్ విలువను బట్టి వ్యవసాయ భూములకు సెంట్లు లెక్కన, వ్యవసాయేతర భూములకు గజాల లెక్కన నష్టపరిహారం చెల్లింపు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒకటిన్నర రెట్లని కొంత మంది అధికారులు, రెండున్నర రెట్లని మరి కొంత మంది అధికారులు చెబుతున్నారు. రైతులతో జరుపుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు (మిగతా 8వ పేజీలో..)

మెనూ నాణ్యతపై కమిటీ

- సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు
- రోగుల భోజనంలో నిబంధనలు పాటించాల్సిందే
- అత్యంత అరుదైన కేసులనే రిఫర్ చేయాలి: డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ



విలేకర్లతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజపతినగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత ఏ మేర పాటిస్తున్నదీ పరిశీలిస్తామని, సమగ్రంగా విచారించి అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి ఎస్‌పీ పద్మశ్రీ స్పష్టం చేశారు. ఇందుకోసం ఒక కమిటీ వేస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లేకపోవడంపై ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో 'ఉడకని అన్నం.. పాచిపోయిన కూర' శీర్షికన కథనం వచ్చిన సంగతి విదితమే. దీనిపై వైద్యాధికారులతో పాటు కలెక్టర్ కూడా సీరియస్ అయ్యారు. వెంటనే విచారించి ఆస్పత్రుల్లో పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించారు. ఇందులో భాగంగా డీసీహెచ్‌ఎస్ గజపతినగరం ఏరియా ఆస్పత్రిని గురువారం సందర్శించారు. జిల్లాలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈమె మొదటిరోజే గజపతినగరం ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. దాదాపు మూడు గంటల పాటు వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వార్డుల్లో రోగులకు అందజేస్తున్న ఆహారం, వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న భోజనంలో ఎటువంటి నాణ్యత పాటిస్తున్నారు.. మెనూ అమలు చేస్తున్నారా.. లేదా అన్నదానిపై కమిటీ వేసి విచారణ చేపడ్తామన్నారు. కమిటీ నివేదిక వచ్చాక ఆస్పత్రుల్లో అక్రమాలు, నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవన్నారు. అలాగే సమయానికి వైద్యులు వస్తున్నారా లేదా.. రోగులకు ఎటువంటి సేవలు అందుతున్నాయి.. తదితర వివరాలపై ప్రతిరోజూ వైద్యశాఖ డైరెక్టర్‌కు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ సమాచారం (మిగతా 8వ పేజీలో..)

గ్రామ, వార్డు సచివాలయాల్లో హేతుబద్ధీకరణ..!

- సాధారణ, నిర్దిష్ట ప్రయోజనాలకు అనుగుణంగా ఉద్యోగుల విభజన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



శృంగవరపుకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు రంగం సిద్ధమైంది. వీరిని రెండు కేటగిరీలుగా విభజించారు. సాధారణ, నిర్దిష్ట ప్రయోజనాల ప్రాతిపదికగా ఉద్యోగుల నియామకం చేపట్టనున్నారు. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, (గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5వరకు), డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ, విద్యా సహాయకులు, గ్రామ మహిళ పోలీస్, వార్డు సచివాలయాల్లో వార్డు అభివృద్ధి కార్యదర్శి, వార్డు ఎడ్యూకేషన్, డేటా ప్రోసెసింగ్ కార్యదర్శి, వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శి, వార్డు మహిళ పోలీస్‌లను సాధారణ కేటగిరీగా పరిగణించారు. వీరిని జనాభా ప్రాతిపాదికన గ్రామ వార్డు సచివాలయాల్లో నియమి స్తారు. కాగా నిర్దిష్టంగా (తప్పకుండా) పని చేసేందుకు జనాభా ప్రాతిపదికతో పనిలేకుండా గ్రామ సచివాలయా లన్నిటిలోను గ్రామ రెవెన్యూ అధికారి, ఏఎన్‌ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, సెరీకల్చర్ (మిగతా 8వ పేజీలో..)

ఉమా జూట్‌మిల్లు లాకౌట్ ఎత్తివేత

భారీగా సిగరెట్ బాక్సుల పట్టివేత

7

పర్యాటక ప్రాంతంగా సాలూరు


పారమ్మకొండ వద్ద మేఘాలు ఇలా..

- వడివడిగా అడుగులు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆధ్యాత్మిక కేంద్రంగా పారమ్మ కొండ అభివృద్ధికి ప్రణాళిక
- రిజర్వాయర్ల వద్ద బోటు షికారు, వాటర్ స్పోర్ట్స్‌కు సన్నాహాలు

'ఈ ఎత్తయిన కొండలు... కొండల మధ్య నుంచి కనిపించే మంచు.. ఆ నడుమ ప్రవహిస్తున్న సెలయేళ్ల సందడి... ప్రకృతి సేద్యం, కమ్మనైన మట్టి వాసన... మంచి మనసున్న గిరిజన ముద్దబిడ్డలు. వీరందరి మధ్య ఇక్కడే ఉండి పోవాలని అనిపిస్తోంది.'.. ఇటీవల బాగుజోల గ్రామానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందన ఇది. ఈ ప్రాంతాన్ని మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి అని ఆయన నోటి నుంచి రావటంతో గిరిజనులతో పాటు అక్కడ ఉన్న వారంతా ఎంతో ఆనందించారు. ప్రస్తుతం ఆ మాటలు కార్యరూపం దాల్చబోతున్నాయి.

సాలూరు/సాలూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)

కనుచూపుమేర పచ్చదనంతో మురిపించే అడవులు... కొండలు... నింగి నుంచి నేలకు రాళ్లపై జాలువారే జలపాతాలు.. ఇవన్నీ సాలూరు ఏజెన్సీలో ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి రమణీయతను పరిశీలించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. కొఠియా కొండల అందాలు ప్రత్యేకం. కొఠియా నుంచి ఒడిశాలోని దేవ్‌మాలి, తోలోమాలికి గిరిశిఖర అందాలు తిలకించేందుకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాలూరు నియోజకవర్గంలో ఉన్న ప్రకృతి అందాలకు నగిషీలు అద్ది.. మరింత ఆకట్టుకునే పర్యాటక ప్రదేశాలుగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాంతాన్ని మంచి టూరిజం స్పాట్‌గా మార్చేందుకు అధికారులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.


వాటర్ స్పోర్ట్స్‌కు...

పాచిపెంట మండలంలో ఉన్న పెద్దగెడ్డ రిజర్వాయర్... సాలూరు మండలంలో ఉన్న వెంగళరాయ సాగర్‌లో బోటు షికారుతో పాటు వాటర్ స్పోర్ట్స్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొదమ పంచాయతీ పరిధిలో ఉన్న 'లొద్ద' జలపాతం వద్ద పార్క్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఇప్పటికే కాలినడకన ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. శిఖపరువు, దండిగాం, కురుకూట్టి, దళాయివలస, ఆలూరు, నీలంవలసతో పాటు అనేక చోట్ల ఎత్తయిన జలపాతాలు ఉన్నాయి. ఏటా కార్తీక మాసంలో పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. పాచిపెంట మండలంలోని గురివినాయుడుపేటలో కొండపై ఉన్న నందీశ్వరుడు, మంచాడవలసలో ఉపసహిత గోకర్ణేశ్వరస్వామి ఆలయం, కాగుడువలస సమీపంలో ఉన్న గుమ్మలకొండ ఇలా అనేక శైవ క్షేత్రాలు పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలుగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది.


32 చేతులతో పారమ్మతల్లి విగ్రహం

ఇక్కడే షూటింగ్..

గతంలో వెంగళరాయ సాగర్ వద్ద మెగాస్టార్ చిరంజీవి నటించిన 'చూడాలని ఉంది' చిత్రం, ఏవీబీలో అలీ హీరోగా మరో చిత్రం షూటింగ్ చేశారు. ఆర్.నారాయణ మూర్తి నటించిన అనేక విప్లవ చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. సినిమా షూటింగ్‌లకు వీలుగా తగిన సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.


శిఖపరువు జలపాతం

ఆధ్యాత్మిక క్షేత్రంగా పారమ్మకొండ

పాచిపెంట మండలం చీపురువలస గ్రామ సమీపంలో ఉన్న పారమ్మకొండ ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ కొండ ఎత్తు సుమారు 2,400 అడుగులు ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పారమ్మతల్లి 32 చేతులతో దర్శనమిస్తుంది. అమ్మవారి తలపై పరమశివుడు ధ్యానం చేస్తున్నట్లు ప్రతిమ ఉంటుంది. ఈ కొండ ప్రాంతాన్ని మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి యోచిస్తున్నారు. ఇప్పటికే జాతీయ రహదారి నుంచి కొండకు చేరుకోవడానికి రూ. 1.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పారమ్మతల్లి జాతరతో పాటు ఇతర ఏర్పాట్లను దేవదాయ శాఖ మొక్కుబడి తంతుగానే నిర్వహించేది. అమ్మవారికి ధూపదీప, నైవేద్యాల కోసం భూములు ఉన్నాయి. అవి ఎవరి చేతుల్లో ఉన్నాయి? వాటి నుంచి ఎంత ఆదాయం వస్తుంది? ఏటా భక్తులు చెల్లించే మొక్కులు, మూడుపులు ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయి? విరాళాలు ఏమవుతున్నాయి? అనే విషయంపై మంత్రి దృష్టి సారించారు. ఈ ఏడాది మహాశివరాత్రి రోజున ప్రభుత్వ పర్యవేక్షణలో పూజారి ఆధ్వర్యంలో పారమ్మతల్లి జాతరను నిర్వహించారు. రానున్న రోజుల్లో కొండ కింద నుంచి పై వరకు కూడా సోలార్ విద్యుత్ దీపాలు, తాగునీటితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కొండపై లయకారుడైన శివుడి ప్రతిమను కూడా ప్రతిష్ఠించనున్నారు.

నిర్వహణ ముఖ్యం..

గతంలో ఐటీడీఏ పీవోగా ఉన్న సువర్ణపండాదాస్ పాచిపెంటలో ఉన్న పెద్దగెడ్డ వద్ద బోటు షికారును ప్రారంభించారు. నిర్వహణ లోపంతో అనతి కాలంలోనే అటకెక్కించారు. పర్యాటక కేంద్రాలుగా మార్చడంతో సరిపెట్టకుండా వాటి నిర్వహణపైనా అధికారులు దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు..

సాలూరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచనలతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వనున్నాం. ఇప్పటికే సాలూరు మండలం లొద్ద జలపాతానికి వెళ్లేందుకు అనువుగా రూ.6 కోట్లతో పనులు చేస్తున్నాం.

-మణిరాజ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పార్వతీపురం ఐటీడీఏ


కొండపైకి వెళుతున్న పవన్ కల్యాణ్ తదితరులు (ఫైల్)

పెట్టుబడిదారులను స్వాగతిస్తున్నాం..


జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పెట్టుబడిదారులను స్వాగతిస్తున్నాం. ముందుగా పెట్టుబడిదారులు పర్యాటక శాఖతో ఒప్పందం కుదుర్చుకొని నివేదిక అందించాలి. వారికి కావాల్సిన ప్రభుత్వ స్థలాన్ని సమకూరుస్తాం.

-ఎ.శ్యాంప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రభుత్వం అడుగులు వేస్తోంది..

సాలూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో ఉన్న అనేక ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. పర్యాటక ప్రాంతాలుగా మారితే గిరిజనుల జీవనోపాధి మరింత మెరుగు పడుతుంది. పాచిపెంట మండలంలో ఉన్న పారమ్మకొండను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి.. మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా రూపొందిస్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర మంత్రి


కొఠియా అందాలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపు
- కేడర్‌తో విస్తృత స్థాయి సమావేశం
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- వైసీపీ విమర్శలను తిప్పికొట్టాలని దిశానిర్దేశం

మెంటాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక ఎన్నికల్లో నూరుశాతం స్థానాల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పని చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. గురువారం ఆమె మండల పార్టీ కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అన్ని గ్రామాలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చేసిన మంచిని చెప్పుకోకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరించారు. స్థానికంగా ప్రభుత్వ పథకాల అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షించి... స్పందనకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అధికారిక కార్యక్రమాల్లో జనసేన, బీజేపీని కలుపుకొని వెళ్లాలని మంత్రి సూచించారు. ప్రభుత్వంపై విపక్షాల విమర్శలను బలంగా తిప్పికొట్టి ప్రజల ముందు వాస్తవాలను ఉంచాలని ఆమె సూచించారు. ఐదేళ్ల విధ్వంస పాలనతో దెబ్బతిన్న రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, నాయకులు జి.అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, ఆర్.రవిశంకర్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లెవెన్ రెడ్డికేం తెలుసు పి-4 గొప్పతనం?

శవ రాజకీయాలు, విధ్వంసం తప్ప పాలన చేతకాని లెవెన్(11)రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు అమల్లోకి తెచ్చిన చరిత్రాత్మక పి-4 గురించి ఎలా తెలుస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. గురువారం మెంటాడలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు. పి4 నిర్వచనం పలకడానికి జగన్ రెడ్డికి నోరు తిరగడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమం అణగారిన వర్గాలకు ఆశాదీపం వంటిదని అభివర్ణించారు. చంద్రబాబు కార్యదక్షతతో కచ్చితంగా విజయవంతమవుతుందని చెప్పారు. పోలీసులపై జగన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బేషరతు క్షమాపణలు చెప్పాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. బట్టలూడదీయడానికి అవి బజారులో దొరికే డ్రెస్సులు కాదని, కఠోర శిక్షణ, శ్రమతో సాధించుకున్న ఉద్యోగానికి, దేశభక్తికి అది ప్రతీక అని సంధ్యారాణి అన్నారు. నాడు పోలీసులతో వెట్టి చాకిరీ చేయించుకొని, వారు లేనిదే బయటకు కాలుపెట్టలేని జగన్... ఇప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటే పిచ్చి ముదిరి.. మందులు వేసుకోవడం మానేశారేమోనని మంత్రి వ్యాఖ్యానించారు. తలకిందలుగా తపస్సు చేసినా వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదని తెలిసి కూడా జగన్ రెడ్డి కేడర్‌ను మభ్యపెట్టడానికి మళ్లీ సీఎం అవుతానంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

పల్లెకు అందని ఆర్టీసీ వెలుగు



- ఇంకా మెరుగుపడని రవాణా
- గత ఐదేళ్లలో రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- అప్పట్లో బస్సు సర్వీసులు నిలిపివేసిన వైనం
- పునరుద్ధరించాలని గ్రామీణుల వినతి

రాజాం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'కొత్త బస్సులు తెస్తున్నాం... రవాణా సౌకర్యాన్ని మారుమూల గ్రామాలకూ విస్తరిస్తున్నాం' అంటూ ఓవైపు ఆర్టీసీ అధికారుల ప్రకటనలు. మరోవైపు సరైన రవాణా సౌకర్యం లేక.. ఆటోలనో... ఏ ఇతర వాహనాలనో ఆశ్రయిస్తున్న గ్రామీణులు. ఇవేవీ లేకపోతే.. ఇతర గ్రామాలకు వెళ్లడానికి మారుమూల ప్రాంతాల నుంచి కిలో మీటర్ల దూరం నడిచి... ప్రధాన రహదారులకు చేరుకుంటున్న జనం.. ఇదీ ఆర్టీసీ సేవల తీరుకు దర్పణం. కొత్తగా గ్రామీణ ప్రాంతాలకు రహదారి సదుపాయం కలుగుతోంది. కానీ ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణ లేదు. విజయనగరం చుట్టుపక్కల మండలాలకు కొంత ఇబ్బంది లేకున్నా... మిగతా ప్రాంతాల్లో మాత్రం ఆర్టీసీ సేవలు తీసికట్టుగా మారుతున్నాయి. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఆర్టీసీ సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత బస్సుల సంఖ్య పెరిగినా.. గ్రామీణ ప్రాంతాలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభు త్వం ఆర్టీసీని నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ ప్రాంతాలకు అసలు బస్సులే వెళ్లకుండా చేసింది. పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితం చేసింది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగు తోంది. పక్కా రహదారులు ఉన్నా... ఆర్టీసీ అధికారులు సర్వీసులు తిప్పడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అత్యవసర, అనారోగ్య సమయాల్లో ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి.

జిల్లాలో ఇలా...

ఉమ్మడి జిల్లాలో విజయనగరం, ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం, పాలకొండలలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 480 బస్సులు ఉన్నాయి. మరో 100 వరకు అద్దె బస్సులు నడుస్తున్నాయి. వీటిలో చాలా వరకు కాలం చెల్లినవే. పట్టణాలు, మండల కేంద్రాలకు గ్రామీణ సర్వీసులు నడుస్తున్నాయి. కానీ మారుమూల గ్రామీణ ప్రాంతాల వారు బస్సును చూడడమే లేదు. జిల్లాలో అన్ని డిపోల పరిధిలో బస్సులు లక్షా 76 వేల కిలోమీటర్ల మేర తిరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. 78 శాతం ఆక్యుపెన్సీతో రోజుకు సగటున రూ.51 లక్షల ఆదాయం సమకూరుతున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. సేవలను మారుమూల గ్రామాలకు మరింతగా విస్తరిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో అన్ని మండలాలను కలుపుతూ లింకు రహదారులు ఉన్నాయి. వీటిని కలుపుతూ ఆర్టీసీ గ్రామీణ సర్వీసులు నడిపితే ప్రజలకు ఉపయోగకరం. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల నిర్వహణ లేకుండా పోయింది. రహదారులు దారుణంగా ఉండడంతో బస్సులు వెళ్లలేని దయనీయ స్థితి. అందుకే గ్రామీణ సర్వీసులు నడపలేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు రహదారులు మెరుగైనా...పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న గ్రామాలకు కొంత సౌకర్యంగా ఉన్నా... అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారికి మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ఐదు డిపోల్లో ఎక్స్‌ప్రెస్‌లే అధికం. పల్లెవెలుగు బస్సులు అంతంతమాత్రమే. మరోవైపు విద్యార్థులు రాయితీ, సీజనల్ పాసులు పొందుతున్నా సకాలంలో సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం విద్యాసంస్థలకు వెళ్లడానికి... సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

● డిపో ఏర్పాటు ఎప్పుడు?

రాజాం పట్టణంలో కొత్తగా ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసే అంశం మరుగునడిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త డిపో ఏర్పాటుపై హడావుడి చేసింది. గత కలెక్టర్ చొరవతో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మున్సిపాలిటీకి చెందిన 1.30 ఎకరాలను సేకరించగలిగారు. ఆక్రమణల పేరిట సమీపంలోని చిరు వ్యాపారులను సైతం ఖాళీ చేయించారు. ఏళ్లు గడుస్తున్నా ఆర్టీసీ డిపో ఏర్పాటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ ప్రాంతీయులకు ఎదురుచూపులే మిగిలిపోయాయి. రెండు జిల్లాల పరిధిలో దాదాపు 10 మండలాలకు రాజాం ప్రధాన కేంద్రం. ఆర్టీసీ సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారు అధిక మొత్తంలో టిక్కెట్లు వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు టిక్కెట్ రూ.20 ఉంటే ఆటోలకు రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ సర్వీసుల పెంపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● అరకొరగానే సర్వీసులు..

మాది వంగర మండలం. రాజాం నుంచి అరకొరగానే బస్సులు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఇబ్బంది పడుతుంటాం. ఆర్టీసీ అధికారులను అడిగితే రోడ్లు బాగాలేవని చెబుతున్నారు. ఆటోలను ఆశ్రయించి రాజాం చేరుకోవాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో నరక యాతన తప్పడం లేదు.

-నీలకంఠం, కొప్పర కొత్తవలస, వంగర మండలం

ఆటోలే గతి..

రాజాం నియోజకవర్గంలో సంతకవిటి మండలం కీలకం. రాజాం నుంచి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ అరకొరగానే బస్సు సర్వీసులు ఉన్నాయి. ఒకసారి బస్సు తప్పిపోతే ఆటోలే గతి. ఆటో జనంతో నిండే వరకు వేచి ఉండాల్సిందే. ఇది అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందికరంగా ఉంటోంది. అందుకే ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలి.

-రాగోలు ఆనంద్, సంతకవిటి


విజయనగరంలో కురుస్తున్న వర్షం


భామిని మండల కేంద్రంలో..

చిరుజల్లులతో ఉపశమనం

- జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం, రాత్రి చిరుజల్లులు కురిశాయి. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత.. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఈ చినుకులతో కాస్త సేదదీరారు. ఉదయం నుంచీ ఎండలు తీవ్రంగా ఉన్నాయి. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు గంట్యాడ మండలంలో కూడా గురువారం రాత్రి వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు కూడిన వర్షం కురిసింది.

భామినిలో...

భామిని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భామినిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలకు ఎండల నుంచి కాస్త ఉపశమనం కలిగించింది. ఈ వర్షం వల్ల వేసవి దుక్కులకు అనుకూలంగా ఉంటుందని... పండిన నువ్వు చేనుకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. గాలులతో సాయంత్రం ఐదు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం రాత్రి వరకూ మండలంలోని వివిధ ప్రాంతాలు అంధకారంలోనే ఉన్నాయి.

వేపాడలో...

వేపాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేపాడలో గురువారం రాత్రి 7 గంటల తరువాత మోస్తరు వర్షం పడింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో ప్రజలు కాస్త ఊరట చెందారు. రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారని స్థానికులు అంటున్నారు.

ప్రజాశ్రేయస్సే లక్ష్యం కావాలి: మంత్రి

మెంటాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ప్రజాప్రతినిధులుగా మనందరి ఉమ్మడి లక్ష్యం ప్రజలకు మేలు జరిగేలా చూడడమేనని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వం మాదిరిగా ఉద్యోగులపై అనవసరమైన ఒత్తిడి ఉండదన్నారు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. పథకాల అమలులో అధికారులు అలసత్వం వద్దన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండలాభివృద్ధి కోసం సూచనలు సలహాలను స్వీకరిస్తానన్నారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆధునికీకరించిన మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

నెల్లిమర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్‌ల మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల నేపథ్యంలో శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్‌పురం, తుమ్మలపేట, చినబూరాడపేట, పారసాం, గెద్దపేట, భూపాలపురం, ఆనందపురం, తాళ్లపూడిపేట, పెదబూరాడపేట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● గంట్యాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరవ, నీలావతి, జగ్గాపురం, గొర్లిపేట, కొర్లాం, గింజేరు, బూడిపేట, పొల్లంకి, పెదమజ్జిపాలెం, లక్కిడాం, వసంత, సిరిపురం, మురపాక, పెదవేమలి, పెంట శ్రీరాంపురం, రావివలస, చంద్రంపేట, కొటారుబిల్లి, పెణసాం, కిర్సుబర్తి, చినమానాపురం, బుడతనాపల్లి, గొడియాడ, నందాం, బొండపల్లి మండలం కొవ్వాడ పేట, యడ్లపాలెం, కొత్తపాలెం, మరువాడ, కొత్తవలస, గుమడాం, వెదురువాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

●విజయనగరం రింగురోడ్డు: దాసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త 11 కేవీ ఎస్‌డీఎఫ్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో పలుచోట్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని పోర్టిసిటీ స్కూల్, టౌన్ సెంటర్ లే అవుట్, శ్రీనివాస్ నగర్, పీఆర్ కాలనీ, కృష్ణరాజాపురం, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా

మెంటాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తన విజయం ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. గురువారం మెంటాడలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు వెళ్తానన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.కృష్ణ ప్రధాన కార్యదర్శి కె.కనకరావు, రాష్ట్ర కార్యదర్శి గొర్ల అప్పలనాయుడు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు గొర్లె శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శృంగవరపుకోట ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శంకుస్థాపనలు చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు తెలిపారు. ఉదయం 8గంటలకు పోతనాపల్లి, 8.30 గంటలకు సంతగైరమ్మపేట, 9గంటలకు ఎస్.కోటలోని రైతుబజార్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వండి

చీపురుపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. చీపురుపల్లిలో గురువారం వైసీపీ మండల అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు ఆధ్వర్యంలో పింఛన్‌దరఖాస్తు దారులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంత్, ఒలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ సేతు మాధవన్ గ్రంథపాలకులకు సూచించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారి గురువారం జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు రావల్సిన సెస్‌ను వసూలు చేయాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చే వారికి సౌకర్యాలను కల్పించాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మి, లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందచేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ సీహెచ్.గోపాలరావు కుటుంబానికి పోలీసు సిబ్బంది అండగా నిలిచారు. రూ.1.48 లక్షల మొత్తానికి సంబంధించిన చెక్‌ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా మృతుడి భార్య శారదకు అందచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఏవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఐ గోపాలనాయుడు, పోలీసు అసోసియేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల కోసం వెయ్యి రోజుల ప్రణాళిక



పిల్లలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ

గంట్యాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం వెయ్యి రోజులు ప్రణాళిక కార్యక్రమాన్ని రూపొందించినట్టు ఐసీడీఎస్ పీడీ రుక్సాన్ బేగం తెలిపారు. పోషకాహార పక్షోత్సవాలలో భాగంగా గురువారం కొర్లాం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వరకూ పోషక వయస్సు వచ్చే వరకూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల ఆరోగ్యవంతమైన తరం సమాజానికి అందుతుందన్నారు. ఈ పథకం అమలులో భాగంగా లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాలతో తమ పేర్లను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయం ఉందన్నారు. పోషకార లోపం పెద్ద సమస్య అని, దాన్ని నివారించడానికి ప్రత్యేకంగా పోషకాహార అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలోని సూపర్‌వైజర్ పద్మ తదితరులు ఉన్నారు.

బెల్లాన రవికి అభినందనలు



రవిని అభినందిస్తున్న ఫేకర్ మాజీ జీఎం

గరివిడి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లికి చెందిన న్యాయవాది బెల్లాన రవి ఉత్తరాంధ్ర నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ప్రత్యేక ప్రభుత్వ అభియోజకుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవిని గరివిడి ఫేకర్ మాజీ జీఎం టి.కమలాకరరావు, గరివిడి మాజీ సర్పంచ్ వయ్యారి సూర్యనారాయణ అభినందించారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని..



పూజలు చేస్తున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని గురువారం జనసేన నాయకులు గురాన అయ్యలు, ఆదాడ మోహనరావు పైడితల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జన సైనికులు రాజేశ్, పవన్‌కుమార్, పృథ్వీ, భార్గవ్, అభిలాష్ ఉన్నారు.

సారా రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

నెల్లిమర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లను సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సుధారాణి అధ్యక్షతన మండల స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా ఎంపీపీతో పాటు కన్వీనర్‌గా ఎక్సైజ్ సీఐ, సభ్యులుగా ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని సారా తయారు చేసే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు, ఎంపీడీవో రామకృష్ణరాజు,హెచ్‌డీటీ రవిశంకర్, ఏఎస్ఐ రమణమూర్తి ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వండి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌లో జాప్యం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీశ్ అన్నారు. గురువారం ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అందుకు గ్గట్టు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ ప్రతినిధులు కోరారు.

భారీగా సిగరెట్ బాక్సుల పట్టివేత

● రూ. 1.72 కోట్ల సరుకు స్వాధీనం

● జీఎస్టీ ఎగవేస్తూ గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం



సిగరెట్ కార్టన్‌లను పరిశీలిస్తున్న ప్రసాదరావు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలో చెల్లూరి సమీపంలో గోదాంపై గురువారం రాత్రి విజిలెన్స్, జీఎస్టీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి భారీఎత్తున సిగరెట్ల బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ప్రాంతీయ నిఘా అధికారి ప్రసాదరావుకు అందిన సమాచారంతో గోదాంపై అధికారులు దాడు నిర్వహించారు. అదే సమయంలో విశాఖ నుంచి గోదాంకు వచ్చిన వ్యానును తనిఖీ చేశారు. ఎటువంటి అనుమానం రాకుండా ఎస్‌కే ఎంటర్‌ప్రైజెస్ విశాఖపట్నం పేరిట వ్యాన్ లోపల సిగరెట్లపైన టాక్స్ ఇన్‌వాయిస్ ఉన్న అగ్గిపెట్టెలను పెట్టారు. దీంతో గోదాంలో ఉన్న సిగరెట్లను లెక్కించగా 31,500 కారన్ల(పెద్ద బాక్స్)ల్లో 3,15,000 సిగరెట్ పెట్టెలు ఉన్నట్టు తనిఖీల్లో గుర్తించారు. వీటి విలువ రూ. కోటి 72 లక్షల 50వేలుగా గుర్తించారు. వాహనం, గోదాంలో ఉన్న సరుకును తదుపరి చర్యలు నిమిత్తం సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చినట్టు విజిలెన్స్ ఎస్పీ జి.ప్రసాదరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమ వ్యాపారులపై నిఘాపై పెట్టామని, పట్టుబడితే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, ఎస్ఐ రామారావులతో పాటు జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.



గోదాంకు సిగరెట్లతో వచ్చిన వ్యాన్

మేలు కోరే ప్రభుత్వమిది: ఎమ్మెల్సీ గాదె



ఎమ్మెల్సీను సత్కరిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట/రూరల్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయుల మేలు కోరేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు అన్నారు మన సమస్యలును అర్థం చేసుకుని పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి మండలంలోని భర్తపురంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు ఇందుకూరి అశోక్‌రాజు, కర్రి మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.బంగారునాయుడు, తమటపు అప్పారావు తదితరులున్నారు.


కుళాయిల నుంచి బురదనీరు



మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

భోగాపురం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): కుళాయిల ద్వారా బురద నీరుగా వస్తోందని, సమస్యను పరిష్కరించాలని భోగాపురం సర్పంచ్ ఉప్పాడ అప్పయ్యమ్మ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ ఉప్పాడ అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భోగాపురంలోని కుళాయిల ద్వారా బురదనీరు అంశాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా మత్స్యకార నాయకుడు బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ గత ఏడాది మత్స్యకారులకు వేట నిషేధం భృతి ఇవ్వలేదన్నారు. ఈ ఏడాదైనా మత్స్యకారులకు అందేలా చూడాలన్నారు. ఎంపీపీ అనూష మాట్లాడుతూ ఇంటింటా కుళాయి కనెక్షన్లు పూర్తయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌కు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పచ్చిపాల నాగలక్ష్మి, డి.సూర్యనారాయణరాజు, ఎంపీడీవో కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాజాం అభివృద్ధి



నాయకులతో మాట్లాడుతున్న కోండ్రు జగదీశ్

రాజాం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సారధ్యంలో అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందుతుందని సీనియర్ టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ అన్నారు. గురువారం రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల్లోని పాల్గొని నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే.. ప్రతి బుధవారం, శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారన్నారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు, నాగళ్ల అప్పలనాయుడు, రౌతు వెంకటరమణ, కరణం శివశంకరరావు, రవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భోగాపురం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళ (45) ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. ఈనెల 7న భోగాపురం జాతీయ రహదారిపై శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న రహదారిలో గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఆమె విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. దీనిపై కేసు నమోదు చేశాయని సీఐ తెలిపారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి జైలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం, నమ్మించి మోసగించిన కేసులో నగరంలోని దాసన్నపేటకు చెందిన మెయిద పైడిరాజుకు ఐదో ఏడీజే మహిళా కోర్టు న్యాయాధికారి ఎన్.పద్మావతి ఏడాది కఠిన కారగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమాన విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహమూర్తి తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పైడిరాజు వంచించాడని 2021లో బాధిత మహిళ మహిళా స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ కేసు నమొదు చేయగా డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పైడిరాజు నేరం రుజువు కావటంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని సీఐ నర్సింహమూర్తి తెలిపారు.

నీలగిరి తోట దగ్ధం

నెల్లిమర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేట-కొండవెలగాడ రోడ్డు పక్కన రెండు ఎకరాల నీలగిరి తోట దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. తొలుత విజయనగరానికి చెందిన ఓ వైద్యుడి నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం ప్రారంభమై పక్కనే ఉన్న జరజాపుపేట గ్రామానికి చెందిన బొలే సత్యనారాయణ, బొలే భాస్కరరావులకు చెందిన నీలగిరి తోటకు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సత్యనారాయణ, భాస్కరరావులకు చెందిన నీలగిరి తోటతో పాటు రెండు సాగు నీటి మోటార్లు, గడ్డి కుప్ప కూడా దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. రూ.లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

కాపుశంభంలో ఇరువర్గాల వివాదం

గరివిడి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో కాపుశంభం గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. గ్రామంలో కొంతమంది యువత రెండు రోజుల కిందట ఓ బోర్డును ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు బుధవారం గ్రామానికి వెళ్లి ఆ బోర్డుపై అక్షరాలు కనబడకుండా ముసుగేశారు. దీనిపై ఓ వర్గానికి చెందిన పలువురు గ్రామానికి గురువారం వెళ్లి స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ లోకేశ్వరరావు, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని వారితో చర్చలు జరిపారు. ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో ఇలాంటి బోర్డులు పెట్టరాదని సూచించారు. ఇలాంటి బోర్డులు పెట్టడం వల్ల గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొనే ప్రమాదం ఉంటుందన్నారు. ఇటీవల మరో వర్గీయులు గ్రామానికి వచ్చి తమ మనోభావాలు దెబ్బతీయడంతోనే బోర్డు ఏర్పాటు చేశామని కొందరు గ్రామస్థులు చెప్పారు. అధికారులు వేసిన నల్ల ముసుగును తొలగించారు. బోర్డులు తీసివేయాలని అధికారులు చెప్పినప్పటికీ వారు అంగీకరించలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు చేపడతామని అధికారులు వెనుదిరిగారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కొత్తవలస, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ తమ్మన్న మెరకలో సారాతో వ్యక్తిని అరెస్టు చేసి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ వీఎన్ రాజు తెలిపారు. గ్రామంలో దాడులు చేస్తుండగా సరిపల్లి దేముడు సారాతో పట్టుబడ్డారన్నారు. అతడిని అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పర్చామన్నారు.

ఉమా జూట్‌మిల్లు లాకౌట్ ఎత్తివేత

● 23 నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తి

కొత్తవలస, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలోని ఉమా జూట్ మిల్లులో లాకౌట్‌ను గురువారం యాజమాన్యం ఎత్తివేసింది. లాకౌట్ ఎత్తి వేయడమే కాకుండా ఉమా జూట్ మిల్లు పేరును ధాన్యశ్రీ జూట్ ప్రొడక్ట్సుగా మార్పు చేశారు. గత సంవత్సరం జూన్‌లో యాజమాన్యం జూట్ మిల్లు లాకౌట్ విధించింది. సుమారు 400 మంది కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయి. అప్పటి నుంచి జూట్ మిల్లును తెరవాలని కార్మికులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు గత నెల 30న విశాఖలోని జేసీఎల్ వద్ద జరిగిన చర్చలలో జూట్ మిల్లులో లాకౌట్ ఎత్తివేయడానికి యాజమాన్యం అంగీకరించింది. అందుకు తగ్గట్టు గురువారం నుంచి మిల్లులో లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించి ముందుగా నిర్వహణ పనులను చేపట్టారు. మిల్లులో 23 నుంచి ఉత్పత్తి ప్రారంభం చేయనున్నట్టు యాజమాన్యం కార్మిక సంఘం నాయకులకు తెలిపింది. జూట్ మిల్లు లాకౌట్ ఎత్తివేయడంతో కార్మికుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి.

ట్రేడ్ టెస్ట్ అర్హతకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్-2025 అర్హత పొందేందుకు ఐటీఐ ప్రైవేట్ అభ్యర్థులుగా ఎన్‌టీసీ సర్టిఫికేట్ పొందేందుకు పరీక్ష నిమిత్తం ఈనెల 12లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నాలుగు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నిండాలని, 10వ తరగతి లేదా దాని సమాంతర విద్యార్హత కలిగి ఉండాలన్నారు. సంబంధిత ట్రేడ్‌కు సంబంధించి మూడేళ్ల పైబడి రిజిస్టర్ అప్రంటీస్‌షిప్ యాక్టు కంపెనీ నుంచి అనుమతి కలిగి ఉండాలన్నారు. సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 8985054780, 9849118075 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బొద్దాంలో 150 మందికి వైద్య పరీక్షలు

వేపాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు విజయనగరంలోని శ్రీసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీరామమూర్తి తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ రాజేశ్, డాక్టర్ లహరిజ్యోత్స్న తదితరులు సేవలందించారన్నారు. ఈ సందర్భంగా రోగులకు సలహాలు, సూచ నలు అందించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రా సన్యాసిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి వృథా ఎవరికీ పట్టదా?

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఖండేపల్లిలో తాగునీరు వృథా అవుతోంది. ఆరునెలలుగా తాగునీటి ట్యాంకు దగ్గర పైప్‌లైన్ లీక్ అయినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. పెద్దఎత్తున తాగునీరు లీకవుతుండటంతో ఆ ప్రాంతం చిన్నపాటి చెరువులామారింది. కళ్లెదుటే నీరు వృథా అవుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పాలకుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృథాగా పోతున్న తాగునీరు



కేఎల్ పురం బ్రిడ్జి డిజైన్ మార్చండి

గరివిడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలక్ష్మీపురం రైల్వే లైన్‌కు నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి డిజైన్ మార్చాలని మండల టీడీపీ, వైసీపీ నేతలు కోరారు. ఇటీవల రైల్వే అధికారులు గ్రామానికి వచ్చి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన భూమిని కొలతలు వేశారన్నారు. వారి కొలతలకు తగ్గట్టు సుమారు 50 ఇళ్లు కోల్పోయే అవకాశం ఉందని ఆర్డీవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమస్యపై అధికారులు దృష్టిసారించి డిజైన్ మార్చాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో మండల టీడీపీ నేతలు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, వైసీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న వివిధ పార్టీల నాయకులు

ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

● రెల్లి కులస్థుల రిలే దీక్ష



రిలే దీక్షలో పాల్గొన్న రెల్లి కులస్థులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లి రెల్లి గ్రూపు కులాలలకు ఐదు శాతం రిజర్వేషన్ వర్తింపచేయాలని బొబ్బిలి రెల్లి కుల (ఎస్‌సీఏ) గ్రూపు సంఘం అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ అన్నారు. ఈసందర్భంగా బొబ్బిలి డివిజన్ రెల్లి కులస్థులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెల్లి కులం అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ చేసి 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 26 లక్షల జనాభా ఉన్నప్పటికీ ప్రత్యేక రిజర్వేషన్ లేకపోవడంతో వివిధ రంగాల్లో ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గెజిట్‌లో రెల్లి కులం లేకపోవడం బాధాకరం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐదు శాతం రిజర్వేన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెల్లి కుల నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతి

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రెల్లి గ్రూపు కులాల వారికి 13 భాషలు ఉన్నాయని, లిపి లేదని వీరందరినీ ఎస్సీ వర్గీకరణలో వేరు చేయకుండా ఎ-కేటగిరిలో చేర్చాలని రెల్లి కులపెద్దలంతా స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయనను కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక కోటలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఐదు శాతం రిజర్వేషన్ వర్తించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని వారంతా కోరారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

లోకో పైలెట్లపై పనిభారం తగదు

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే లోకో పైలెట్లపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకోపైలెట్లకు ఎటువంటి విశ్రాంతి లేకుండా నిరంతరాయంగా పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. ఈ ఉత్వర్వులను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న విశాఖలో రైల్వే సేఫ్టీ సదస్సు నిర్వహించనున్నారని, దీనికి అందరూ హాజరు కావాలని శంకరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్.గోపాలం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో పాత సామగ్రి వేలానికి చర్యలు

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో పనిచేయని పాత యంత్రాలు, సామగ్రి ఈ-వేలం ద్వారా అమ్మాలని ప్రతిపాదిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పాత పరికరాలను గుర్తించి విక్రయాలు జరిపేందుకు ప్రభుత్వం కమిటీని నియమించిందన్నారు. ఇందులో భాగంగా ఐటీఐల ఆర్డీడీ ఆర్వీ రమణ స్థానిక ఐటీఐని సందర్శించి ప్రాథమికంగా పలు పాత పరికరాలను గుర్తించారని ఆయన చెప్పారు. పూర్తిస్థాయిలో అన్నిటినీ గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని తమను ఆదేశించారన్నారు. తదనంతరం కమిటీ ఆమోదంతో ఈ-టెండర్ల ద్వారా వేలం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకువెళ్లండి

బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడులలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన విద్యార్థులకు చెందిన ఒరిజినల్ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు కొంతమంది విద్యార్థులు తీసుకోకపోవడంతో తమ వద్దనే ఉన్నాయన్నారు. సంబంధిత విద్యార్థులంతా తమ ఐటీఐ ప్రొవిజినల్ సర్టిఫికెట్, పదో తరగతి సర్టిఫికెట్, రెండు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఐటీఐకి వచ్చి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కరెంటు బిల్లులతో సంబంధం లేకుండా ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా పేదలకు ఇంటి స్థలాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. తక్షణమే ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలన్నారు లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు రంగరాజు, వాసు, అప్పలరాజు, సూరీడమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎంయూ ఆందోళన



డిపో గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఎన్ఎంయూ సభ్యులు

శృంగవరపుకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపో గేటు వద్ద గురువారం ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు ఆందోళన చేశారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ వెంటనే ఆపాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. గ్యారేజీ ఉద్యోగులు అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా కార్యదర్శి పి.జె.రాఫెల్, జోనల్ ఉపాధ్యక్షుడు జి.ఎస్.రాజు, జిల్లా కమిటీ సభ్యుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని పూజలు

భోగాపురం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ సింగ్‌పూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో త్వరగా కోలుకోవాలని మారుతీ వికలాంగుల సంఘం ప్రతినిధులు గురువారం షిర్డీసాయి మందిరంలో పూజలు నిర్వహించారు. ఆర్.చిన్నారావు, బట్నా వెంకటరమణ పాల్గొన్నారు.

మెనూ నాణ్యతపై కమిటీ

(5వ పేజీ తరువాయి)

అందిస్తామన్నారు. జిల్లాలో అన్ని ఆసుపత్రులను సందర్శించి వైద్య సేవలను పరిశీలిస్తామన్నారు. సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. జిల్లాలో అధికంగా గర్భిణులను రిఫర్ చేయడం సరికాదని, అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తమ చేయిదాటి పోతుందని అనుకున్న కేసులను మాత్రమే రిఫర్ చేయాలని వైద్యాధికారులకు చెప్పామన్నారు. ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్టులు ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులతో సమయన్వయంతో మెలగాలన్నారు. కొత్తగా గర్భిణి కేసు నమోదు అయ్యాక ప్రసవం అయ్యేంతవరకు ఎటువంటి వైద్యం అందజేస్తున్నదీ అందరికీ తెలిసేలా గ్రూప్ కాల్ ఏర్పాటు చేసుకోవాలని, అందులో తనను చేర్చాలని సూచించారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో పాటు గుండె జబ్బు నివారణకు ప్రతీ ఆసుపత్రిలో మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోందన్నారు. మే నాటికి వందపడకల ఆసుపత్రిగా ఏరియా ఆస్పత్రి మారుతుందని, రోగులకు మరింత మెరుగైన వైద్యం అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సీనియర్ జిల్లా వైద్యులు రాజ్యలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

● కూలేందుకు సిద్ధంగా బలిజిపేట ఎమ్మార్సీ భవనం

బలిజిపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గతంలో నిర్మించిన ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ కార్యాలయాన్ని బలిజిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు భవనంలోకి తాత్కాలికంగా మార్చారు. శిథిలమైన భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయి. కూలేందుకు సిద్ధంగా ఉంది. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న ఈ భవనం ఏ క్షణాన కూలుతుందోనని ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ భవనం పక్క నుంచే ఎంపీడీవో కార్యాలయానికి అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు కూడా ఈ దారిలో ప్రయాణిస్తారు. ఇప్పటికైనా ఈ శిథిల భవనాన్ని తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో బలిజిపేటలో ఎమ్మార్సీ భవనం

ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి

● వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ అభినందన

● జిల్లాకు 12 జాతీయ నాణ్యతా హామీ ప్రమాణ సర్టిఫికెట్లు

పార్వతీపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు గతంలో ఎప్పుడూ లేని విధంగా 12 జాతీయ నాణ్యతా హామీ ప్రమాణ సర్టిఫికెట్లు వచ్చాయి. దీనికి కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖాధికారులను, సిబ్బందిని కలెక్టర్ శ్యాంప్రసాద్ అభినందించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.రఘు, జిల్లా టీబీ వైద్యుడు వినోద్, ఉమ్మడి జిల్లా క్వాలిటీ ఎన్యూరెన్స్ అధికారి కె.శ్రీనివాస్, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డా.డి.రమణకుమార్, క్వాలిటీ మోనటరింగ్ జిల్లా కన్సల్టెంట్ డా.మణికంఠ, సీసీ శ్రీనివాసరావులు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. జిల్లాకు ఎన్క్యాస్ సర్టిఫికెట్లు లభించిన తీరును ఆయన వివరించారు. దీంతో కలెక్టర్ వారిని అభినందిస్తూ.. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఒకేసారి జిల్లాలో 12 సబ్ సెంటర్లకు ఎన్క్యాస్ సర్టిఫికెట్లు మంజూరు కావడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హేమలత పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో భాస్కరరావును అభినందిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఆ చెత్తశుద్ధి ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

అధ్యయనం చేసేవారంటే అతిశయోక్తి కాదు. 2016లో సెంట్రల్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) సంస్థ ప్రతినిధులు సందర్శించి ఆశ్చర్యపోయారు. మున్సిపాలిటీకి జాతీయ అవార్డు ప్రకటించారు.

చెత్తకాదు సంపద అంటూ..

అప్పట్లో కమిషనర్‌గా పనిచేసిన కరుణాకరం ప్రసాద్ స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, పట్టణ పౌరులు, మున్సిపల్ పాలకవర్గం, సిబ్బందిని ప్రణాళికాబద్ధంగా సమన్వయం చేశారు. ప్రతీ ఇంటి నుంచి తడి చెత్తను, పొడి చెత్తను సేకరించేందుకు రెండు రకాల ప్లాస్టిక్ బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగా చెత్తను ఎవరూ కాలువల్లో గాని, రోడ్లపై గాని పారబోయనీయకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. అందుకోసం వార్డుల్లోని ప్రజలందరికీ విస్తృతమైన అవగాహన కల్పించారు. ఇంటింటికీ కూడా వెళ్లి చెప్పారు. ఇది చెత్తకాదు దీంతో సంపద సృష్టించవచ్చు అని చెప్పి ఆకర్షనీయమైన నినాదాలతో పట్టణ ప్రజల మనసు దోచుకున్నారు. దీనికి తోడుగా బొబ్బిలి పట్టణంలో పాలిథిన్ కవర్లు, వాటర్ ప్యాకెట్లను నిషేధించారు. ఈ నిషేధాన్ని రాష్ట్రమంతా నివ్వెరపోయేలా అమలు చేశారు. కరుణాకరం ప్రసాద్ పదవీ విరమణ చేశాక ఆ తరువాత వచ్చిన వారంతా ఆ స్థాయిలో దీనిపై దృష్టి పెట్టలేదు. ప్రైవేటీకరణ నిర్ణయం చెత్తశుద్ధి పార్కునకు శాపంగా మారిందని స్థానికలంటారు.

● అట్టపెట్టెలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాడిపారేసిన బట్టలు ఇలా వ్యర్థాలన్నింటినీ సేకరించాక వేరు చేసి ప్యాకింగ్ చేసి విక్రయించేవారు. కూరగాయల వ్యర్థాలతో వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసేవారు.బయోగ్యాస్, బయో విద్యుత్‌ను ఉత్పత్తి చేసేవారు. పట్టణంలో సుమారు 1072 వ్యాపార సంస్థలు ఉండగా వాటి నుంచి రోజుకు 8.4 టన్నుల చెత్తను సేకరించినట్లు లెక్కలు చెబుతున్నాయి.

ప్రైవేటుకు లీజుకు ఇచ్చాకే..

2018లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటై బొబ్బిలి, చీరాల, సాలూరు మాదిరిగానే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు ఈ తరహా చెత్తశుద్ధి ప్రక్రియను అమలు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత ప్రైవేటీకరణ తెరపైకి వచ్చింది. డిజైన్, బిల్డ్, ఆపరేషన్, ట్రాన్స్‌ఫర్ (డీబీఓటీ) పద్ధతిలో సాలిడ్ పార్కులో రెండున్నర ఎకరాల స్థలాన్ని చదరపు మీటరుకు ఒక రూపాయి చొప్పున లీజుకు ఇచ్చారు. ఇలా రెండు సంస్థలకు 11 సంవత్సరాలకు, 30 సంవత్సరాలకు లీజు కట్టబెట్టారు. ప్రైవేట్ సంస్థలు శాస్త్రీయంగా నిర్వహిస్తాయని చెప్పి మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించడం మానేశారు. నేడు పార్కుకు ఆరుబయట చెత్తకుప్పలను పారబోయడమే కాక, వాటికి మంటలు పెట్టి తగులబెడుతున్నారు. చెత్తను కాల్చడం పర్యావరణపరంగా నిషేధం.

వడ్డీ రాయితీకి గడువు పొడిగింపు

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను, ఖాళీ స్థలాలపై గల పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 50 శాతం వడ్డీ రాయితీ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో మార్చి 24న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గత నెలాఖరు వరకు మాత్రమే వడ్డీపై 50 శాతం రాయితీ ఉండేదని చెప్పారు. గత నెలలో ఉగాది, రంజాన్ వంటి పండుగలు రావడం, ఆర్థిక సంవత్సరం గడువు ముగియడానికి కేవలం ఆరు రోజులు గడువు మాత్రమే ఉండడంతో ప్రభుత్వం పునరాలోచన చేసిందని తెలిపారు. దీని ప్రకారం భవనాలు, ఖాళీ స్థలాలపై చెల్లించాల్సిన ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ రాయితీని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెంబరు 66ని గురువారం జారీ చేసినట్టు ఆమె తెలిపారు. ఇప్పటికే ఆస్తిపన్ను బకాయిలను చెల్లించిన వారికి ఈ వడ్డీ రాయితీని తదుపరి పన్ను వాయిదాల చెల్లింపుల్లో మినహాయిస్తామని ఆమె స్పష్టంచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తాజాగా చెల్లించాల్సిన ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ ఉందని కమిషనర్ వివరించారు. పన్ను బకాయిదారులు, పన్ను చెల్లింపుదారులంతా ఈ రాయితీలను వినియోగించుకుని పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షల శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రోగాన్నయినా తొలిదశలో గుర్తించగలిగితే దాని నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా రోటరీ ప్రతినిధులు జేసీ రాజు, సింద్రీ శ్రీనివాసరావులను అభినందించారు. డీఎస్పీ భవ్యారెడ్డి మాట్లాడుతూ వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొన్నారు. రోటరీ అధ్యక్షుడు సిసింద్రీ శ్రీనివాసరావు, డా.అభినయ్ మాట్లాడుతూ రూ.5వేలు విలువ చేసే పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు గెంబలి శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు, తెంటు చిరంజీవిరావు, చింతల రామకృష్ణ, రోటరీ కార్యదర్శి సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

సాగు పట్టాలు ఇవ్వండి

● సీపీఐ నాయకుల ఆందోళన

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు గిరిజనులతో కలిసి ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తోందని, ఇంకా సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గిరిజనులు నివాసముంటున్న ప్రాంతాలకు చేరువలో గల పంచాయతీల్లో వారిని విలీనం చేయాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, కృష్ణ, బిహెచ్, చిరంజీవి, జీర, టింగు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో హేతుబద్ధీకరణ

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్, వెటర్నరీ, పీషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఇలా ఏడుగురు ఉద్యోగులు, వార్డు సచివాలయాల్లో అయితే వార్డు రెవెన్యూ కార్యదర్శి, వార్డు హెల్త్ కార్యదర్శి, వార్డు ప్లానింగ్, రెగ్యులైజేషన్ కార్యదర్శి, వార్డు అమెనిటీస్ కార్యదర్శి, వార్డు శానటరీ, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, ఎనర్జీ కార్యదర్శి ఇలా ఆరుగురు ఉద్యోగులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేసారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల నియామకం ఈ విధంగా అమలు చేసేలా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి.

● గత వైసీపీ ప్రభుత్వం 2019 జూలైలో నూతనంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. నెలకు రూ.15000 జీతం చెల్లించిన ప్రభుత్వం రెండేళ్ల అనంతరం 2022 జూలైలో వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. అయితే వీరిలో కొన్ని రకాల ఉద్యోగులకు పని ఒత్తిడి, మరికొన్ని రకాల ఉద్యోగులకు పని లేకపోవడాన్ని ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు నిర్దిష్టంగా పని ఉండే సాంకేతిక విద్యను అభ్యసించిన ఉద్యోగులందరినీ గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన ఉద్యోగులను సాధారణ కేటగిరి కిందకు తీసుకొస్తూ హేతుబద్ధీకరణ చేస్తున్నారు. ఇలా ఉద్యోగులను సర్దుబాటు చేయడం ద్వారా ప్రభుత్వం రియల్‌టైమ్ గవర్నెన్స్‌ను అమలు చేయాలని భావిస్తోంది.

పూలే, అంబేద్కర్ జయంతి సభకు తరలిరండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శివరామరాజుపేటలో శుక్రవారం నిర్వహించనున్న మహాత్మ జ్యోతిబాపూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతి సభకు అభిమానులు తరలిరావాలని బహుజన ఉద్యమ నేత అతవ ఉదయ్ భాస్కర్ కోరారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, వెనకబడిన తరగతుల అభ్యుదయానికి పాటుపడిన మహానుభావుల కోసం గ్రామీణ ప్రజలకు తెలిపేందుకు జయంతి సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా జరుపుతున్న ఈ సభకు అతిథులుగా ఎమ్మెల్యే కోళ్ల లలితకు మారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులను ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో గుల్రపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మా భూములను లాక్కోవద్దు

(5వ పేజీ తరువాయి)

ఆర్డీవో కార్యాలయం నుంచి వస్తున్న అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కో గ్రామానికి ఒక్కో మార్కెట్ విలువ ఉంది. ఉదాహరణకు శృంగవరపుకోట గ్రామంలో సెంటు రూ.18,000, గజం రూ.3000 ఉంది. జెడ్ కుమరాంలో సెంటు రూ.8000, గజం రూ.800 ఉందంటున్నారు. స్థానిక అధికారులు చెబుతున్న నష్టపరిహారం బట్టి శృంగవరపుకోటలో సెంటుకు రూ.45000, గజం స్థలంపై రూ.7,500 వస్తుంది. జెడ్ కుమరాం రైతులకు సెంటుకు రూ.20,000, గజం స్థలంపై రూ.2,000 అందుతుంది. ఈ భూములు ప్రైవేటు మార్కెట్‌లో ఇంతకు పది రెట్లు ధరలు పలుకుతున్నాయి. కలెక్టర్ అంబేద్కర్‌తో జరిగిన సమావేశంలో ప్రభుత్వ మార్కెట్ రేటుకు మూడున్నర రెట్లు నష్టపరిహారం అందిస్తామని చెప్పినట్లు సీఐటీయూ నాయకుడు మద్దిల రమణ చెబుతున్నారు.

రైతులే విత్తనాలు సమకూర్చుకోవాలి

కొత్తవలస, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమకు కావలసిన విత్తనాలను రైతులే తయారు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు తెలిపారు. గురువారం కొత్తవలసలోని రైతు భరోసా కేంద్రంలో కొత్తవలస రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో సామూహిక నవధాన్యాల కిట్ల తయారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట నువ్వులు, చిరు ధాన్యాలు పంటలలో నవధాన్యాల విత్తనాలు కలిపి అంతర పంటలుగా సాగు చేసుకోవాలని అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగువల్ల రైతులకు ఖర్చు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణ, వ్యవసాయాధికారి అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'బడి బాట'లో ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అలజంగి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎజ్జల మోజేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్య, మౌలిక వసతులను వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన

రామభద్రపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో నిర్దేశించిన కొలతలను వేతనదారులు పూర్తిచేసే విధంగా చూడాలని ఏపీవో గొలగాని త్రినాథరావు సూచించారు. నాయుడువలస గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయడం ద్వారా సుమారు రూ.300 వేతనం పొందవచ్చునన్నారు. అనంతరం మస్తర్లను తనిఖీ చేశారు. ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సదస్సుకు తరలిరావాలి

బొబ్బిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12న విద్యుత్ రంగ సమస్యలపై జరగనున్న సదస్సుకు అందరూ తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఆపాలని, పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్లపై ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్‌లో గల ప్రభుత్వ బధిరుల పాఠశాలలో 1 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.దయానంద తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. 2025-2026 సంవత్సరానికి చెవిటి, మూగ బాల బాలికలకు వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్, జనన సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, బియ్యం కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్‌తో పాఠశాలను సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9000013640, 9440437629 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాజాం పురపాలక సంఘం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

టెండర్ నిట్ నెం. 233 to 273/2024-25/E1-Rajam Municipality, Dt.11-04-2025.

రాజాం మునిసిపాలిటీ పరిధిలో రోడ్లు మరియు కాలువలు నిర్మాణం పురపాలక సంఘం సాధారణ నిధులు, మరియు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్ట్ టెండర్లు పిలువబడుచున్నవి.

పనుల సంఖ్య : 41 కాంట్రాక్టు విలువ : రూ.323.00/- లక్షలు

Details	Date and Time	
1. Bid Document Downloading Start Date	11.04.2025	10.00 AM
2.Bid Document Downloading End Date	30.04.2025	3.00 PM
3. Last Date & Time for Receipt of Bids	30.04.2025	5.00 PM

నోట్: ఇతర వివరముల కొరకు ఈ దిగువ తెలియజేసిన ఫోన్ నెంబర్లను సంప్రదించవలెను. ఆఫీసు పనిచేయు సమయములో తెలుసుకొనగలరు మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ను చూడవలెను.

Commissioner, Rajam Municipality,
Ph.No.9849905797 &
Visit us.@www.tender.apeprocurement.gov.in

Sd/- COMMISSIONER
Rajam Municipality

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు రాజాం పురపాలక సంఘము

బహిరంగ వేలం నోటీసు

రేఖా నెం. 350/2025/ఎ1, తేది: 09.04.2025

వ. నం.	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు నం.	కేటగిరి	చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము	తే:10.04.2025ది నుండి తే:15.04.2025ది లోగా రాజాం పురపాలక సంఘము కమిషనరు వారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్	గుత్త కాలము
20.	అన్నపూర్ణ షాపింగ్ కాంప్లెక్స్	15	BC	5000	50000	
21.		16	BC	5000	50000	
22.		17		5000	50000	
23.		18	BC	5000	50000	
24.		19	BC	5000	50000	
25.		20	BC-A	5000	50000	
26.		21	BC	5000	50000	
27.	పురపాలక సంఘ కార్యాలయం ముందు షాపుల	4	BC-A(W)	5000	50000	
28.	సూర్య షాపింగ్ కాంప్లెక్స్	10	BC-A(Rajika)	5000	50000	
29.		13	OC	5000	50000	
30.		14	OC	5000	50000	
31.		18	SC(W)	5000	50000	
32.	శ్రీనివాస షాపింగ్ కాంప్లెక్స్	9	BC	5000	50000	తేది. 1.4.2025 నుండి తేది. 31.3.2027

వేలం ఏ కారణము చేతనైన వాయిదా వేయుటకు లేదా రద్దు పరుచుటకు కౌన్సిల్ వారికి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకోనవచ్చును. గజిట్ నోటీఫికేషన్ పురపాలక సంఘము కార్యాలయుము నందు లభించును. సదరు వేలం పాట పూర్తి అయిన తరువాత గుత్తదారులు అగ్రిమెంటు రిజిస్ట్రేషన్ కొరకు కావలసిన చార్జీలు పురపాలక సంఘము కార్యాలయము నందు పాట రోజునే చెల్లించవలెను.

కమిషనర్, రాజాం పురపాలక సంఘము